


# నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### కొంటెప్రశ్నలు - చిలిపి జవాబులు

***పసిపాప నాలుగో వారంలో నవ్వడం ఆరంభిస్తుంది. ఎందుకని?***

అప్పటికి మీ మొహం మీద చూపు నిలపగలదు కాబట్టి

***అట్లాంటిక్ మహాసముద్రం సగందూరం దాటాలనుకుంటే ఏ ఓడ ఎక్కాలి?***

టైటానిక్

***భోజనం నిత్యం ఉచితంగా దొరకాలంటే ఏం చెయ్యాలి?***

జైలుకెళ్ళాలి

***రాజీ పడడమంటే?***

సమాధానం సరిపడేలా ప్రశ్నని మార్చుకోవడం

***టెలివిజన్ చదరంగం ఆట చూస్తున్న తనభార్యకి భర్త ఏమని సలహా ఇచ్చాడు?***

'టెన్నిస్ ఆట చూడరాదూ!? కాస్త లావైనా తగ్గుతావు!'

***నరకానికి వెళతామని తెలిసీ కోర్టుల్లో చాలామంది అబద్ధాలెందుకు చెబుతారు?***

నిజం చెబితే జైలుకు వెళ్తామన్న భయంతో!

****

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"చూడ్రా ఆ మోహనరావుగాణ్ణి ఓ అయిదు రూపాయలు అప్పడిగాను. లేవని ఠక్కున నిర్మొహమాటంగా చెప్పేశాడు. మన స్నేహితుల్లో అలాంటి దౌర్భాగ్య దామోదరుడు మరెవడూ లేడనుకో. సరేగానీ...ఓ.."

"లేకేం, నేను అలాంటి వాణ్ణేలే" అని చల్లగా జారుకున్నాడా మిత్రసత్తముడు.

❦❦❦

కొత్త సంవత్సరం వచ్చింది. కిరాణా కొట్టువాళ్ళు కొత్త కేలెండర్లు ఇస్తున్నారు.

"నాకొక కేలండరు ఇవ్వరూ?" అనడిగిందొక పదేళ్ళమ్మాయి వచ్చి.

"మీ అమ్మగారు మా కొట్లో ఏం కొనరు. కేలండరు అడగొచ్చా?"

"అదేంటి అలా అంటారు? మాకేది కావాలన్నా మా పక్కింటి పాపాయమ్మగారింట్లోనే అప్పు తెచ్చుకుంటున్నాం. పాపాయమ్మగారు సరుకులన్నీ మీ కొట్లోనే కొంటుందయ్యే."

❦❦❦

"మీ హోటల్లో రూమ్ కు అద్దె ఎంతండీ?"

"రోజుకు ఇరవైరూపాయలు"

"స్టూడెంటునండీ. తగ్గింపేమీ లేదా?"

"అలాగయితే అద్దె నలభై రూపాయలు. వారం అద్దె ఎడ్వాన్సుగా ఇవ్వాలి."

❦❦❦

ఓ పడుచువాడు లాయరు దగ్గర కొచ్చాడు. దొంగతనం కేసు పెట్టారు పోలీసులు. కాబట్టి తన తరపున వాదించమని కోరాడు.

"అదెంత పనోయ్. చిటికెల మీద నీ కేసు రద్దయిపోతుంది మనం తలుచుకున్నామంటే. కేసు పెట్టినవాళ్ళు తెల్ల మొహం వేయాలి. కాని నువ్వు ఫీజు దండిగా ఇచ్చుకోవాల్సుంటుంది"

"కానీ, నా దగ్గర డబ్బేమీ లేదు."

"డబ్బు లేకపోతే ఎలా? ఏదో వస్తువు తాకట్టు పెట్టో, అమ్మేసో డబ్బు పట్రావాలి. ఏముందు నీ దగ్గర?"

"కొత్త స్కూటర్ ఒక్కటి మాత్రం ఉంది."

"ఇంకేం? ఇంతకీ నువ్వేం దొంగతనం చేశావని కేసు పెట్టారు?"

"కొత్త స్కూటర్."

"శంభూ ఎక్కడిదిరా ఆ స్టీల్ టిఫిన్ బాక్స్. కొన్నావా?"

"అబ్బే లేదు.బహుమతిగా వచ్చింది."

"అదృష్టవంతుడివి. ఎవరిచ్చార్రా?"

"ఏమోగానీ, ఇదుగో ఇక్కడ పేరు చెక్కించి ఉంది చూడు. సరిగా అర్ధం అయిచావటం లేదు"

ఇంగ్లీషు మాట్లాడే అన్ని దేశాలలో జార్జి బెర్నార్డ్‌షా నాటకాలు ప్రదర్శించబడ్డాయి. నాటక కర్తగా కోట్ల రూపాయలు సంపాదించిన ఘనుడు ప్రపంచంలో ఆయనొక్కడే.

షా రాసిన నాటకం ఒకటి తొలిసారిగా లండన్‌లో ప్రదర్శింపబడింది. ప్రేక్షకులకు ఆ నాటకం ఎంతగా నచ్చిందంటే, షా తప్పనిసరిగా స్టేజీమీదకు రావాలని పట్టుబట్టారు. ఆయన వెళ్ళి నిలబడగానే ఆఖరుక్లాసు ప్రేక్షకుడొకడు గల్లంతు మొదలెట్టాడు.

షా నవ్వుతూ ఆ ప్రేక్షకుడినుద్దేశించి

"మిస్టర్ నేను నీతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. కానీ ఇంత పెద్దహాలులో భిన్నాభిప్రాయం కల వాళ్ళం మనం ఇద్దరమే అయిపోయామే. మరీ గొడవచేస్తే జనం తంతారేమో. మనం జాగ్రత్తగా ఉండటం మంచిది" సలహా ఇచ్చాడు.

"నీ వృత్తేమిటయ్యా?"
"తిట్లు తినటం."
"అదేమిటి?"
"నేను బిల్లు కలెక్టరుని. నన్ను అల్లంత దూరంలో చూడగానే రక్తం ఉడకడం ప్రారంభిస్తుంది అందరికీ."

మిల మిల మెరిసిపోతున్న ఉంగరం చేతికి పెట్టుకుని, కిలకిలమంటూ ఆఫీసు కొచ్చింది సుజాత. పెళ్ళి సంబంధం కుదిరిందనీ, నిశ్చయ తాంబూలాలు తీసుకున్నట్టు తోటి ఉద్యోగినులతో చెప్పింది.
"చూడు సుజాతా నేను చెప్పినట్టుగా నడుచుకున్నావంటే సుఖపడతావు. మీ ఆయన చెప్పిందానికల్లా బుర్ర ఆడించకు. నీకూ వ్యక్తిత్వం ఉన్నదని రుజువు చేసుకో. నా పెళ్ళవగానే నేనేం చేశానో తెలుసా? మా ఆయన్ని సిగరెట్లు, జరదా కిళ్ళీలు మానెయ్యమన్నాను" సలహా ఇచ్చింది మంధరాదేవి.
"మానేశాడా?" అమాయకంగా అడిగింది సుజాత.
"ఏమో? నాకు ఆయన కనబడి పదేళ్ళయింది."

COMMENTS